35% స్కూళ్లలో 50 మందిలోపే విద్యార్థులు

వెల్లడించిన పీఆర్ఎస్

న్యూఢిల్లీ: దేశంలోని విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్యపై నివ్వెరపోయే నిజాలు వెల్లడయ్యాయి. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ వివరాల ప్రకారం 35 శాతం పాఠశాలల్లో 50 లేదా అంత కంటే తక్కువే విద్యార్థులు ఉన్నారు. వీరిలో 10 శాతం విద్యాసంస్థల్లో 20 మంది కన్నా తక్కువే ఉన్నారు. చాలా చోట్ల ఒకరిద్దరు ఉపాధ్యాయులతోనే ఈ పాఠశాలలను నెట్టుకొస్తున్నారు. దీంతో టీచర్లు తమకు సంబంధం లేని సబ్జెక్టులు కూడా బోధించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆ నివేదిక పేర్కొంది. పలువురు ఉపాధ్యాయులకు బోధనేతర కార్యకలాపాలు అప్పగిస్తుండటంతో వారు తమ వృత్తికి పూర్తిగా న్యాయం చేయలేకపోతున్నారు. 2023-24 నాటికి ప్రాథమిక నుంచి హైస్కూల్ స్థాయి వరకు చెప్పే టీచర్లలో 12 శాతం మందికి వృత్తిపరమైన అర్హతలు లేవు. కేంద్ర విద్యా శాఖ వివరాల ప్రకారం 2023-24 నాటికి 48 శాతం టీచర్లు విద్యార్హతలు లేనివారు.

టెన్త్ ఎగ్జామ్స్ ఏడాదికి రెండుసార్లు

- ఫిబ్రవరి-మార్చిలో తొలి విడత, మేలో రెండో విడత పరీక్షలు
- వచ్చే ఏడాది నుంచి అమలు
- ముసాయిదాకు ఆమోదం
- మార్చి 9లోగా అభిప్రాయాలు తెలపాలని సూచన

న్యూఢిల్లీ: వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి బోర్డు పరీక్షలు ఏడాదికి రెండు సార్లు నిర్వహించేందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదా నిబంధనలకు మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ నిబంధనలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని, ఏమన్నా అభ్యంతరాలుంటే మార్చి 9 లోగా తమకు సమర్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులను సీబీఎస్ఈ కోరింది. ఈ కొత్త ముసాయిదా నిబంధనల ప్రకారం మొదటి విడత పరీక్షలు ఫిబ్రవరి-మార్చిలో, రెండో విడత పరీక్షలు మేలో వరకు జరుగుతాయి. విద్యార్థులు కావాలనుకుంటే ఈ రెండు పరీక్షలకు హాజరు కావొచ్చు. మొదటి విడత రాసిన పరీక్షల్లోని కొన్ని సబ్జెక్టులలో వచ్చిన మార్కులతో సంతృప్తి చెందితే ఆ సబ్జెక్టులకు రెండో విడత పరీక్షలను రాయకుండా మానేయవచ్చు. పూర్తి సిలబస్‌కే ఈ పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థికి రెండుసార్లూ ఒకే పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. బోర్డు మొదటి, రెండో విడత పరీక్షలు సప్లిమెంటరీ పరీక్షలుగా కూడా పనిచేస్తాయి. ఎట్టి పరిస్థితుల్లో ప్రత్యేక పరీక్షలు నిర్వహించరు. అంటే ప్రత్యేకంగా సప్లిమెంటరీ పరీక్షల విధానం ఉండదు. నూతన విద్యా విధానంలో భాగంగా, విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు ఏడాది రెండు సార్లు బోర్డు పరీక్షలను నిర్వహించనున్నారు. తమకు వచ్చిన స్పందనలు పరిశీలించిన తర్వాత ముసాయిదాను సమీక్షించి తుది నిబంధనలు ఖరారు చేయనున్నట్టు సీబీఎస్ఈ పరీక్షల కంట్రోలర్ సన్యమ్ భరద్వాజ్ తెలిపారు.



అసెంబ్లీలో కునుకు తీసేందుకు రిక్లైనర్లు

వెల్లడించిన కర్ణాటక స్పీకర్

బెంగళూరు: కర్ణాటక శాసన సభ్యులు లంచ్ తర్వాత కునుకు తీసేందుకు ఈ అసెంబ్లీ సమావేశం నుంచి రిక్లైనర్లు (వాలుగా అమర్చుకునే కుర్చీలు) ఏర్పాటు చేస్తున్నట్టు అసెంబ్లీ స్పీకర్ యూటీ ఖాదర్ తెలిపారు. సమావేశాల సందర్భంగా చాలామంది లంచ్ తర్వాత సభా కార్యక్రమాలకు హాజరు కాకుండా గైర్హాజరవుతున్నారని, దీనిని నివారించడానికి వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. మార్చి 3 నుంచి 21 వరకు జరిగే సమావేశాల కోసం తాత్కాలికంగా 15 రిక్లైనర్లను అద్దెకు తెస్తున్నామన్నారు. ఒక్క సమావేశాలప్పుడు తప్ప మిగతా సమయాల్లో వీటి ఉపయోగం ఉండనందున వాటిని కొనుగోలు చేయకుండా కేవలం అద్దెకు మాత్రమే తీసుకువస్తున్నామన్నారు. సమావేశాలు ముగిసిన వెంటనే వాటిని పంపేస్తామన్నారు. శాసన సభ్యులకు లాబీ బయట టీ, కాఫీ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని స్పీకర్ తెలిపారు.

ప్రభుత్వ అధికారిపై విచారణకు

ముందస్తు అనుమతి తప్పనిసరి

సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ: అధికారిక విధులను నిర్వరిస్తున్న ప్రభుత్వ అధికారిని క్రిమినల్ కేసులో విచారించాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. లైంగిక వేధింపుల కేసులో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారిణి సునేటి తొతేజాకు వ్యతిరేకంగా నమోదైన క్రిమినల్ నేరారోపణల్ని సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. సీఆర్‌పీసీలోని సెక్షన్-197 కింద ముందస్తు అనుమతి తీసుకోకపోవటం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ తప్పుగా పేర్కొన్నది. మంగళవారం ఓ క్రిమినల్ కేసులో విచారణ జరుపుతూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'నిందితుడు ప్రభుత్వ అధికారిక విధులు నిర్వర్తించే అధికారిగా ఉన్నాడా? లేదా? అన్నది చూడాలి. సమాధానం సానుకూలంగా ఉంటే, వారిపై ఉన్న కేసులను కోర్టులో విచారించడానికి ముందస్తు అనుమతి తప్పనిసరి' అని ధర్మాసనం పేర్కొన్నది. ఈ కేసులో తనకు వ్యతిరేకంగా దాఖలైన చార్జ్‌షీట్, సమన్లను రద్దు చేయాలంటూ తొతేజా హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

తీవ్రతను బట్టే చర్యలు

చట్టసభల్లో సభ్యుల ప్రవర్తనపై కోర్టులకు సుప్రీం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: సభ్యులపై చట్ట సభలు తీసుకున్న చర్యలను పరిశీలించే విషయంలో న్యాయస్థానాలకు సుప్రీం కోర్టు మంగళవారం కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించింది. ఒక్కో కేసును న్యాయస్థానం నిశితంగా పరిశీలించి సభ్యుడి ప్రవర్తన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తన విచక్షణను ఉపయోగించి నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం సూచించింది. బీహార్ శాసనమండలిలో ఆర్‌జేడీ ఎమ్మెల్సీ సునీల్ కుమార్ సింగ్ ఉదంతం విషయంలో కొన్ని మార్గదర్శకాలను విధిస్తూ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా సభ్యుడు నినాదాలు చేయడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. అయితే మండలి నుంచి సభ్యుడిని బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని అత్యంత కఠినమైనదిగా, మితిమీరినదిగా అభివర్ణిస్తూ ఈ నిర్ణయాన్ని ధర్మాసనం పక్కనపెట్టింది. సభ్యుడిపై తీసుకున్న చర్య తీవ్రతను పరిశీలించడానికి ముందు సభలో సభ్యుడి ప్రవర్తనను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోర్టులకు ధర్మాసనం సూచించింది. సభ్యులు వ్యక్తీకరించే నాటు హావభావాలు ఉద్దేశపూర్వకంగా చేసినవా లేక స్థానిక యాసభాషల ప్రభావంతో కూడినవా అన్న విషయాలను కూడా కోర్టులు పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది. సభలో అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డారన్న ఆరోపణపై 2024 జులై 26న సునీల్ కుమార్ సింగ్ బీహార్ శాసన మండలి నుంచి బహిష్కరణకు గురయ్యారు. సభలో వాడివేడిగా చర్చ జరుగుతున్న సమయంలో సీఎంకు వ్యతిరేకంగా సునీల్ నినాదాలు చేశారు.

అందరికీ పింఛన్!

- ఉద్యోగంతో పని లేకుండా ప్రజలందరికీ పెన్షన్ సౌకర్యం
- యూపీఎస్ పేరిట మెగా స్కీమ్‌కు కేంద్రం సమాలోచన
- అసంఘటిత కార్మికులు, వ్యాపారులు, గృహిణులకు లబ్ధి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): మలి సంధ్య వేళలో ఆర్థిక అవసరాలను తీర్చే పింఛన్.. పండుటాకులకు కొండంత అండ. అయితే, ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పనిచేసి పదవీవిరమణ చేసిన ఉద్యోగులకే ఈ పింఛన్ సదుపాయం ఉంది. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు, వ్యాపారులు, గృహిణులకు ఇలాంటి ఆర్థిక భరోసానిచ్చే పథకాలు దాదాపుగా ఏమీ లేవు. దీంతో వయసుపైబడిన సమయంలో లక్షలాదిమంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. దీనికి చెక్ పెట్టేందుకు కేంద్రప్రభుత్వం 'యూనివర్సల్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)' పథకాన్ని తీసుకొచ్చే యోచనలో ఉన్నది. ఈ మేరకు జాతీయ పత్రిక 'ఎకనమిక్ టైమ్స్' ఓ కథనంలో వెల్లడించింది.

ఏమిటీ యూపీఎస్?

దేశంలోని 60 ఏండ్లు పైబడిన వారందరికీ నిర్ణీత వ్యవధుల్లో నిర్ణీత మొత్తాన్ని పింఛన్‌గా అందించే పథకాన్నే యూపీఎస్‌గా పిలుస్తున్నారు.ఎంప్లాయ్‌మెంట్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) ఈ మెగా స్కీమ్ విధివిధానాలపై కసరత్తు ప్రారంభించిందని, త్వరలోనే దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని అధికారి ఒకరు వెల్లడించారు.

ఎవరెవరు అర్హులు?

18 ఏండ్లు పైబడిన వారందరూ ఈ స్కీమ్‌కు అర్హులు. ముఖ్యంగా పింఛన్ సౌకర్యంలేని అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు, వ్యాపారులు, గృహిణులు, స్వయం ఉపాధి పొందేవారికి ఈ పథకం మెరుగైంది. ఈ స్కీమ్‌లో చేరేవారు విడుతల వారీగా కొంత డబ్బును చెల్లించాల్సి ఉంటుంది. ఖాతాదారులు కట్టే సొమ్ముకు సమానమైన మొత్తాన్ని అటు ప్రభుత్వం కూడా జమ చేస్తుంది. అలా.. 60 ఏండ్ల దాటిన తర్వాత పింఛన్ డబ్బులు సబ్‌స్క్రైబర్లకు అందుతాయి.

ఒకే గొడుగు కింద

వ్యాపారులు, స్వయం ఉపాధి పొందే వారి కోసం ప్రభుత్వం ఇప్పటికే నేషనల్ పెన్షన్ స్కీమ్ ఫర్ ట్రేడర్స్ అండ్ సెల్ఫ్ ఎంప్లాయ్‌డ్ (ఎన్‌పీఎస్-ట్రేడర్స్), పీఎం శ్రమ్ యోగీ మాందాన్ యోజన (పీఎం-ఎస్‌వైఎం) పేరిట కొన్ని పింఛన్ పథకాలను కొనసాగిస్తున్నది. ఇప్పుడు ఎన్‌పీఎస్-ట్రేడర్స్, పీఎం-ఎస్‌వైఎం స్కీమ్‌లను కలిపి మొత్తంగా అన్నింటినీ యూపీఎస్ మెగా స్కీమ్ గొడుగు కిందకు తీసుకురావాలని కేంద్రం యోచిస్తున్నట్టు సమాచారం. ఇది అమలైతే 60 ఏళ్ల తర్వాత పింఛన్‌ను అందుకోవచ్చు.

దక్షిణాదిపై డీలిమిటేషన్ కత్తి

- తమిళనాడు సీఎం స్టాలిన్ వ్యాఖ్య
- మార్చి 5న అఖిలపక్ష సమావేశానికి పిలుపు
- కేంద్రంపై మరో భాషా యుద్ధానికి సిద్ధమని ప్రకటన

చెన్నై: కేంద్రం తమపై హిందీ భాషను రుద్దడానికి ప్రయత్నిస్తోందని అధికార డీఎంకే ఆరోపిస్తున్న నేపథ్యంలో మరో భాషా యుద్ధానికి రాష్ట్రం సిద్ధమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం ప్రకటించారు. సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభ స్థానాల పునర్విభజన అంశాన్ని చర్చించేందుకు మార్చి 5న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. జనాభా నియంత్రణకు దారితీసిన కుటుంబ ప్రణాళిక కార్యక్రమాన్ని తమిళనాడు విజయవంతంగా అమలు చేసిన కారణంగా ఇప్పుడు 8 లోక్‌సభ స్థానాలను కోల్పోయే ముప్పును రాష్ట్రం ఎదుర్కొంటోందని స్టాలిన్ తెలిపారు. భారత ఎన్నికల కమిషన్‌లో రిజిస్టర్ అయిన రాజకీయ పార్టీలను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానిస్తున్నట్టు ఆయన చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన పేరిట దక్షిణాదిపై కత్తి వేలాడుతోందని స్టాలిన్ అన్నారు. హిందీ భాషను రుద్దడానికి కేంద్రం ప్రయత్నిస్తోందన్న ఆరోపణల నేపథ్యంలో మరో భాషాపరమైన యుద్ధానికి కేంద్రం బీజం నాటుతోందా అన్న ప్రశ్నకు అవునని స్టాలిన్ జవాబిస్తూ అందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

బంగ్లాలో సైనిక తిరుగుబాటు ముప్పు

సైన్యాధ్యక్షుడి హెచ్చరిక

ఢాకా, ఫిబ్రవరి 25: దేశంలో సైనిక తిరుగుబాటు జరిగే ముప్పు పొంచి ఉందని బంగ్లాదేశ్ సైన్యాధ్యక్షుడు జనరల్ వఖర్ ఉజ్ జమాన్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర్యానికి, సార్వభౌమత్వానికి ముప్పు పొంచి ఉన్నట్లు తనకు కనపడుతోందని మంగళవారం ఆయన తెలిపారు. దేశం సురక్షిత హస్తాలలో ఉండాలన్నదే తన ఆకాంక్షని, గత 7-8 మాసాలలో తాను ఎంతో చూశానని ఆయన చెప్పారు. తాను ముందుగానే తిరుగుబాటు గురించి హెచ్చరిస్తున్నానని, రేపు ఎందుకు చెప్పలేదని తనను నిందించవద్దని ఆయన తాత్కాలిక ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై జనరల్ జమాన్ ఆందోళన చెందుతున్నారని, దేశాన్ని విదేశీ శక్తులు నడిపిస్తున్నాయని ఆయన భావిస్తున్నారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. దేశంలో వెంటనే పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించాలని ఆయన రాజకీయ పెద్దలకు సూచిస్తున్నారని, లేని పక్షంలో సైన్యం మరోసారి అధికారాన్ని చేజిక్కించుకుంటుదని ఆయన హెచ్చరిస్తున్నారని వర్గాలు తెలిపాయి.

నటి రవీనాటాండన్ పుణ్యస్నానం

మహా కుంభమేళా నేటితో ముగింపు

నో వెహికిల్ జోన్‌గా ప్రయాగ్‌రాజ్

ప్రయాగ్‌రాజ్: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా బుధవారంతో ముగియనుంది. ఇదే రోజు మహాశివరాత్రి కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో యూపీ సర్కారు మళ్లీ ఆంక్షలు విధించింది. కుంభమేళా ప్రాంతాన్ని 'నో వెహికిల్ జోన్'గా ప్రకటించింది. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి ఉత్తర్వులు అమల్లోకి తీసుకొస్తున్నట్టు తెలిపింది. ఎంట్రీ పాయింట్ సమీపంలోని స్నాన వాటికల వద్దే భక్తులు పుణ్య స్నానాలు చేయాలని, తాజా గైడ్ లైన్స్ పాటించాలని అధికారులు కోరారు. నిత్యావసర సరుకులను తరలించే వాహనాలకు, వైద్యులు, పోలీసులు, ప్రభుత్వ వాహనాలకు మినహాయింపు ఉంటుందని అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌కు థరూర్ గుడ్‌బై?

వరుసగా ప్రత్యర్థులను ప్రశంసిస్తున్న ఎంపీ

పీయూష్ గోయల్‌తో శశిథరూర్ సెల్ఫీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశిథరూర్ సొంత పార్టీకి గుడ్‌బై చెప్పనున్నారా? అంటే తాజా పరిణామాలు అవుననే చెప్తున్నాయి. పార్టీ అధిష్ఠానం తీరుపై అసంతృప్తితో ఉన్న థరూర్ మంగళవారం కేంద్ర ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించడమే కాకుండా ఓ కేంద్ర మంత్రితో సెల్ఫీ కూడా దిగి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తోపాటు బ్రిటన్ వాణిజ్య మంత్రి జోనాథాన్ రెనాల్డ్స్‌ను కలుసుకోవడం సంతోషకరమని థరూర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇటీవలి కాలంలో థరూర్ కాంగ్రెస్ పార్టీకి రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నవారిని పొగడటం పరిపాటిగా మారింది. ఈ నెలారంభంలో కేరళలోని వామపక్ష ప్రభుత్వాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. ఆ తరువాత ప్రధాని మోదీ అమెరికా వెళ్లి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలుసుకొని చర్చలు జరపడాన్ని స్వాగతించారు. కేరళ కాంగ్రెస్‌లో నాయకత్వ లోపం ఏర్పడిందంటూ ఇటీవల సొంత పార్టీపైనే విమర్శలు చేశారు. ఈ చర్యలన్నీ కాంగ్రెస్ అధిష్ఠానానికి థరూర్‌పై ఆగ్రహం తెప్పించాయి. పార్టీలో తనను పక్కన పెట్టారని భావిస్తున్న నేపథ్యంలోనే థరూర్ కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో రాహుల్‌గాంధీ గత వారం థరూర్‌తో ఏకాంతంగా భేటీ అయ్యారు. అయినప్పటికీ థరూర్ కేంద్రంపై ప్రశంసలు కురిపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాను పార్టీ మారే అవకాశం లేదంటూ తనపై వస్తున్న ఊహాగానాలను ఖండించిన థరూర్.. 'పార్టీకి నేను కావాలనుకుంటే.. ఉంటాను.. వద్దనుకుంటే, నాకు చేసుకోవడానికి వేరే పనులున్నాయి. నాకు ఇతర అవకాశాలు లేవని మాత్రం అనుకోవద్దు' అని వ్యాఖ్యానించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కేరళ సీపీఎం థరూర్‌కు స్నేహ హస్తం అందించేందుకు సిద్ధమైంది. థరూర్ కాంగ్రెస్ పార్టీని వీడితే, కేరళ రాజకీయాల్లో అతడిని అనాథగా వదిలి పెట్టబోము అని సీపీఎం నాయకుడు థామస్ ఐజాక్ ప్రకటించారు.

కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్‌కు జీవిత ఖైదు

సిక్కుల ఊచకోత కేసులో ఢిల్లీ కోర్టు తీర్పు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: 1984లో ఢిల్లీలో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన హత్య కేసులో కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌కు ఢిల్లీ కోర్టు జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పింది. జశ్వంత్ సింగ్, ఆయన కొడుకు తరుణ్‌దీప్ సింగ్ హత్య కేసులో సజ్జన్ దోషిగా తేలారని ప్రత్యేక జడ్జి కావేరి బవేజా తెలిపారు. ఈ కేసులో దోషికి మరణ దండన విధించాలని బాధిత పక్షం కోర్టును కోరింది. నాడు ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ హత్య అనంతరం ఢిల్లీలో సిక్కులపై జరిగిన దాడిలో 2,733 మంది చనిపోయారు. ఆనాడు కాంగ్రెస్ ఎంపీగా ఉన్న సజ్జన్ కుమార్ అల్లర్లకు సారథ్యం వహించి దాడుల్లో పాల్గొన్నట్టు నిరూపితం కావడంతో గత నెల 12న కోర్టు ఆయన్ను దోషిగా నిర్ధారించింది. ప్రస్తుతం ఆయన తీహార్ జైల్లో ఉన్నారు.

నత్త నడకన నమామి గంగే

- మూలుగుతున్న నిధులు
- 69% మాత్రమే వినియోగం
- పీఆర్ఎస్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: గంగా నది ప్రక్షాళనకు సంబంధించి కేంద్రం చేపట్టిన నమామి గంగే పథకం నత్తనడకన కొనసాగుతున్నది. దానికి కేటాయించిన నిధుల్లో 2024-25కు కేవలం 69 శాతం మాత్రమే ఖర్చుబెట్టారు. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ అందించిన వివరాల ప్రకారం 2024మార్చి 31 వరకు 876 కోట్ల నిధులుండగా, అందులో 383 కోట్లను మాత్రమే వివిధ ప్రాజెక్టులకు కేటాయించారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన 2014-15 నుంచి రెండు సంవత్సరాలు (2000-21, 2021-22) తప్ప అన్ని ఏండ్లు నిధులు తక్కువగానే ఖర్చు చేశారు. దీనికి కేటాయించిన నిధులు వాడకుండా పెద్దయెత్తున పేరుకుపోయిన విషయాన్ని 2024లో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) కూడా ఎత్తి చూపింది.

ఒక మనిషి.. ఐదు కిడ్నీలు

న్యూఢిల్లీ: సాధారణంగా మనిషికి రెండు కిడ్నీలు ఉంటాయి. కానీ హర్యానాకు చెందిన వ్యక్తికి చాలా అరుదుగా మూడోసారి కిడ్నీ ఆపరేషన్ చేయడంతో ఆయన శరీరంలో మొత్తం ఐదు కిడ్నీలు ఉన్నాయి. గత 15 ఏండ్లుగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న దేవందే బలేవర్(47)కు ఫరీదాబాద్‌లోని అమృత హాస్పిటల్‌లో మూడోసారి ఆపరేషన్ చేసి మరో కిడ్నీని అమర్చారు. 2010, 2012లలో కూడా ఆయనకు కిడ్నీ ఆపరేషన్లు చేసినా అవి ఫెయిలయ్యాయి. దీంతో అతని శరీరంలో నాలుగు పనిచేయని కిడ్నీలు ఉండగా, బ్రెయిన్ డెడ్ అయిన ఒక వ్యక్తి కిడ్నీని నెల రోజుల క్రితం అమర్చారు. దీంతో ఆయన శరీరంలో నాలుగు పనిచేయని, ఒక పనిచేసే కిడ్నీ ఉన్నాయి. ఆపరేషన్ చేసిన 10 రోజులకే అతడిని డిశ్చార్జ్ చేశామని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బలేవర్ తన రోజువారీ కార్యకలాపాలు యథావిధిగా చేసుకుంటున్నారు.

ఒహియో గవర్నర్ పోటీలో వివేక్ రామస్వామి

వాషింగ్టన్: ఒహియో గవర్నర్ పదవికి జరుగుతున్న ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని భారతీయ అమెరికన్, పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామి ప్రకటించారు. సోమవారం సిన్సినాటి నుంచి ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెడుతున్నట్టు 'ఎక్స్'లో ఆయన ప్రకటించారు. వివేక్ రామస్వామి గెలుపొందాలని కోరుతూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్‌లు 'ఎక్స్'లో స్పందించారు.

ఎన్‌సీఈటీ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్: ఇంటిగ్రేటెడ్ బీఈడీ (డిగ్రీ ప్లస్ బీఈడీ)లో 2025 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షకు(ఎన్‌సీఈటీ) ఎన్‌టీఏ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 64 జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో 6,100 సీట్లలో నాలుగేండ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ)లో ప్రవేశాలు పొందవచ్చు. దరఖాస్తుకు మార్చి 16 ఆఖరు తేదీ. వెబ్‌సైట్ – https://exams.nta.ac.in/NCET.

అరగంటలో 350 కిలోమీటర్లు!

- దేశంలో తొలి హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్ సిద్ధం
- రైల్వే శాఖ తోడ్పాటుతో మద్రాస్ ఐఐటీలో ఏర్పాటు

న్యూఢిల్లీ: రవాణా రంగంలో భారత్ సరికొత్త విప్లవాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నది. అందుకోసం తొలి హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్‌ను సిద్ధం చేసుకున్నది. 422 మీటర్ల పొడవైన ఈ ట్రాక్‌ను రైల్వే శాఖ తోడ్పాటుతో మద్రాస్ ఐఐటీ అభివృద్ధి చేసింది. దీని ద్వారా 350 కిలోమీటర్ల ప్రయాణాన్ని 30 నిమిషాల్లోనే పూర్తి చేయవచ్చు. అంటే ఢిల్లీ నుంచి దాదాపు 300 కి.మీ. దూరంలో ఉన్న జైపూర్‌కు అరగంటలోపే చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. రైల్వే శాఖ నిధులతో మద్రాస్ ఐఐటీ క్యాంపస్‌లో హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్ నిర్మితమైందని, ఆ ట్రాక్‌పై జరుగుతున్న పరీక్షల ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. సాంకేతికతల అభివృద్ధికి దోహదపడే ఈ మొదటి ట్రాక్ నిర్మాణం కోసం మద్రాస్ ఐఐటీకి రెండు విడతల్లో మొత్తం రూ.17.43 కోట్లు ఇచ్చామని, ఈ ప్రాజెక్టును మరింత అభివృద్ధి చేసేందుకు మూడో విడతలో మరో రూ.8.71 కోట్లు ఇవ్వనున్నామని వివరించారు. హైపర్‌లూప్ తొలి వాణిజ్య ప్రాజెక్టును త్వరలో చేపట్టాలని రైల్వే శాఖ భావిస్తున్నది.

హైపర్‌లూప్ ట్రాక్ అంటే..

ఐదో రకం రవాణా వ్యవస్థగా హైపర్‌లూప్‌ను చెప్తున్నారు. వాక్యూమ్ ట్యూబుల్లో ఉండే ప్రత్యేక క్యాప్సూల్స్ ద్వారా రైళ్లు అత్యధిక వేగంతో ప్రయాణించేందుకు ఇది వీలు కల్పిస్తుంది. హైపర్‌లూప్‌లోని వాక్యూమ్ ట్యూబ్ లోపల విద్యుదయస్కాంతపరంగా పైకిలేచే పాడ్ ఉంటుంది. తద్వారా ఫ్రిక్షన్, ఎయిర్ డ్రాగ్‌ను (రాపిడిని, గాలి లాగడాన్ని) నిర్మూలిస్తుంది. దీంతో పాడ్ గరిష్ఠంగా మాక్ 1.0 (గంటకు 761 మైళ్ల లేదా దాదాపు 1,225 కిలోమీటర్ల) వేగంతో ప్రయాణిస్తుంది. ఇది విమాన వేగం కంటే రెండు రెట్లు అధికం.

పెండ్లి చేసుకోకుంటే ఇంటికే!

ఉద్యోగులకు చైనా కంపెనీ హుకుం

*బీజింగ్: పెండ్లి చేసుకుంటారా? ఉద్యోగం నుంచి తొలగించమంటారా? అంటూ చైనాలోని ఒక కంపెనీ తమ సంస్థ ఉద్యోగులకు తాఖీదులు ఇచ్చింది. సౌత్ చైనా మార్నింగ్ పోస్టు కథనం ప్రకారం తమ సంస్థలోని ఉద్యోగుల్లో వివాహితుల సంఖ్యను పెంచే లక్ష్యంతో షన్‌టైన్ కెమికల్ గ్రూప్ కంపెనీ యాజమాన్యం తమ కింద పనిచేసే 1200 మంది ఉద్యోగుల్లో అవివాహితులు, విడాకులు తీసుకున్న వారిని టార్గెట్ చేసింది. 28-58